AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

13-3-2026 (Friday) | MAIN EDITION

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌కు ఇజ్రాయిల్ వార్నింగ్




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ముజ్తాబా ఖమేనీకి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌లో నియంతృత్వ పాలనను అంతం చేయడమే తమ లక్ష్యమన్నారు. నెతన్యాహు మాట్లాడుతూ.. టెహ్రాన్ నాయకులకు "జీవిత బీమా" లేదన్నారు. ఇజ్రాయెల్, అమెరికా దాడులు ఇరాన్‌ను గణనీయంగా బలహీనపరిచాయన్నారు. ఇజ్రాయెల్ నేడు బలంగా ఉందని పేర్కొన్నారు. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఖమేనీని ఆయన ఎగతాళి చేశారు. బహిరంగంగా తన ముఖాన్ని చూపించలేరన్నారు. టెహ్రాన్ అణ్వాయుధాలు, దీర్ఘశ్రేణి క్షిపణులను అభివృద్ధి చేయకుండా ఆపడానికి దాడులు అవసరమని తెలిపారు.

## శశికళ కొత్త పార్టీ పేరు ఇదే..




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** తమిళనాడులో మరికొన్ని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ సీఎం దివంగత జయలలిత సన్నిహితురాలు వీకే శశికళ తన కొత్త పార్టీ పేరును ప్రకటించారు. 'ఆల్ ఇండియా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కళగం' అని వెల్లడించారు. కొబ్బరి చెట్ల సమూహాన్ని పార్టీ గుర్తుగా ప్రకటించారు. శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. తమ పార్టీ ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తుందని వివరించారు. జయలలిత మరణం తర్వాత పార్టీలో సమస్యలు తలెత్తాయని, తాను ముఖ్యమంత్రిగా నియమించిన వ్యక్తి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు.

## 17వేల మందికి ఉపాధి




అక్షరటుడే, ఏపీ: 'సీఎం ఉపాధి సృష్టి' పథకం ద్వారా రూ. 300 కోట్లతో 3,500 చిన్న పరిశ్రమలకు ఆర్థికసాయం చేయాలని కేబినెట్ నిర్ణయించిందని ఆంధ్రప్రదేశ్ మంత్రి పార్థసారథి తెలిపారు. ఈ పథకం వల్ల 17 వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే నీరుకొండలో తెలుగు కల్చరల్ సెంటర్ మంజూరు ప్రతిపాదించామని చెప్పారు.

## సన్‌రైజర్స్ లీడ్స్.. 'ఎక్స్' ఖాతా సస్పెన్షన్




అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్: పాక్ స్పిన్నర్ అబ్రార్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు రూ.2.34 కోట్లు వెచ్చించి సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో సన్‌రైజర్స్ ఫ్రాంచైజీపై ఫ్యాన్స్ విమర్శలు గుప్పిస్తున్నారు. వేలంలో సన్‌రైజర్స్ సీఈవో కావ్యా మారన్, ప్రధాన కోచ్ డానియల్ వెటోరి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ లీడ్స్ ఖాతా సస్పెన్షన్‌కు గురవడం గమనార్హం.

## రాష్ట్రాలకు భారీగా నిధులు



అక్షరటుడే, నేషనల్ డెస్క్: దేశంలోని ఆంధ్రప్రదేశ్ సహా ఆరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నిధులు విడుదల చేసేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆమోదం తెలిపారు. 2025లో వరదలు, మొంథా తుపాను నష్టానికి సాయంగా రూ. 1930 కోట్ల నిధులను విడుదల చేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది.

# కల్తీ భూతం

కల్తీ భూతం జడలు విప్పతోంది. కొందరు తమ లాభాల కోసం కల్తీ ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు. వాటిని మార్కెట్‌లో విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అల్లం వెల్లుల్లి పేస్ట్ నుంచి మొదలు పెడితే మద్యం వరకు దేనిని వదలడం లేదు. కాదేది కల్తీకి అనర్హం అన్నట్లు ప్రతి దానిని తయారు చేస్తున్నారు. రసాయనాలతో ఆహార పదార్థాలు తయారు చేస్తుండడంతో.. వాటిని తింటున్న ప్రజలు రోగాల భారిన పడుతున్నారు.

—అక్షరటుడే, హైదరాబాద్‌ప్రతినిధి



- అల్లం వెల్లుల్లి నుంచి మద్యం వరకు..
- అన్నింటిని కల్తీ చేస్తున్న వైనం
- హైదరాబాద్‌లో రెచ్చిపోతున్న మాఫియా
- రాష్ట్రవ్యాప్తంగా విక్రయాలు

హైదరాబాద్ నగరంలో కల్తీ మాఫియా విస్తరించింది. ఏళ్లుగా ఇక్కడ కల్తీ దందా సాగుతోంది. జంతువుల ఎముకలతో నూనె తయారు, కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, సబ్బులు, పేస్ట్‌లు ఇలా అన్నింటిని కల్తీవి తయారు చేస్తున్నారు. అయితే అధికారులు ఇన్నాళ్లు చూసీ చూడనట్లు వ్యవహరించారు. ఇటీవల రాజమండ్రిలో కల్తీ పాలు తాగి పలువురు మృతి చెందారు. దీంతో నగరంలోని కల్తీ మాఫియాపై టాస్క్‌ఫోర్స్, పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో దాడులు చేసి భారీ మొత్తంలో కల్తీ పదార్థాలు పట్టుకుంటున్నారు.

### సర్ఫ్‌ను సైతం.

నగరంలో టీ పౌడర్, సర్ఫ్, గుడ్‌నైట్ రీఫిల్స్ కల్తీ చేస్తున్న ముఠాను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1,340 నకిలీ రెడ్‌లేబుల్ టీ పౌడరు ప్యాకెట్లు, 100 నకిలీ తాజ్ మహల్ ప్యాకెట్లు, 75 కేజీల లూజ్ టీ పౌడరు, 300 వీల్ ప్యాకెట్లు, 550 సర్ఫ్ ఎక్సెల్ ప్యాకెట్లు, 950 టైడ్ సర్ఫ్ ప్యాకెట్లు, 100 ఏరియల్ ప్యాకెట్లు, మస్కిటో రీఫిల్స్ 3,600 నకిలీ గుడ్ నైట్ లిక్విడ్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. తక్కువ నాణ్యత గల వీటిని బ్రాండెడ్ పేరిట బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

### మల్లెపల్లిలో..

నగరంలోని మల్లేపల్లి ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. సింథటిక్ ఫుడ్ కలర్స్, ఎసిటిక్ యాసిడ్, గమ్ పౌడర్ వంటి రసాయనాలు కలిపి తయారు చేస్తున్నట్లు తేలింది. సికింద్రాబాద్‌లోని లాల్లగూడలోని ఒక గోడౌన్‌లో సైతం 1915 కిలోల కల్తీ, అపరిశుభ్రమైన అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. గతంలో మద్యాన్ని సైతం కల్తీ చేశారు. నకిలీ మద్యానికి బ్రాండెడ్ స్టిక్కర్లు వేసి బెల్ట్ షాపులకు సరఫరా చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రాణాలు పోయినా సరేనా.. శనివారం సికింద్రాబాద్‌లోని లాల్లగూడలోని ఒక గోడౌన్‌లో తనిఖీలు చేపట్టారు. 1915 కిలోల కల్తీ, అపరిశుభ్రమైన అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా సికింద్రాబాద్ జోన్ బృందం, కమిషనర్ టాస్క్ ఫోర్స్, లాలగూడ పోలీసులతో కలిసి లాల్లపేటలోని జనప్రియ అపార్ట్‌మెంట్ సమీపంలో ఉన్న ఝాన్సీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ గోడౌన్‌పై దాడి చేసింది. కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేసింది. వారి నుంచి కల్తీ అల్లంతో పాటు తయారీకి ఉపయోగించే సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో కల్తీ మద్యాన్ని సైతం అధికారులు సీజ్ చేశారు. నకిలీ లిక్కర్‌ను బ్రాండెడ్ బాటిళ్లలో నింపి బెల్ట్ షాపులకు సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశారు.

### పెరుగును సైతం

అంబర్‌పేటలోని రహత్‌నగర్‌లో ఉన్న ఎస్ఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రాంగణంలో కల్తీ పెరుగును తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు అధికారులు గురువారం దాడి చేశారు. ఆరు నెలలుగా ఈ ప్రాంతంలో పాలు, పాల ఉత్పత్తుల వ్యాపారాన్ని నిర్వహిస్తున్న నిర్వహిస్తున్నారు. దాదాపు 2,500 కిలోల కల్తీ పెరుగును స్వాధీనం చేసుకున్నారు.

### డాల్డాతో నెయ్యి..

బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 12లోని భోలా నగర్‌లోని ఫ్రైడ్ డైరీ అనే పాల యూనిట్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇటీవల దాడి చేశారు. డైరీ యజమాని మహ్మద్ జునైద్ హుస్సేన్ వనస్పతి (డాల్డా) ఇతర తక్కువ నాణ్యత గల పదార్థాలతో నెయ్యి తయారు చేస్తున్నట్లు గుర్తించారు. దానిని ప్యాక్ చేసి మార్కెట్లో స్వచ్ఛమైన నెయ్యిగా విక్రయించాడు.

### చర్యలు కరువు

నగరంలో కల్తీ మాఫియా ఎన్నో ఏళ్లుగా ఉంది. వారం పది రోజుల నుంచి తనిఖీలు చేస్తున్న అధికారులు గతంలో పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇన్ని రోజులు వారు ఎంత మొత్తంలో కల్తీ పదార్థాలు విక్రయించి ఉంటారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. వాటిని తిన్న ప్రజల ఆరోగ్యం ఏమి అయిపోతుందని ఆందోళన చెందుతున్నారు. కల్తీ మాఫియా కఠిన చర్యలు లేకపోవడంతోనే దందా రోజురోజుకు పెరుగుతుందనే విమర్శలు ఇన్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ అంటే ఇదేనా.. రాహుల్ గాంధీకి హరీశ్‌రావు లేఖ



**అక్షరటుడే, హైదరాబాద్:** మాజీ మంత్రి హరీశ్‌రావు లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. రాజ్యాంగాన్ని రక్షించాలని దేశం మొత్తం తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్‌ను ఇటీవల స్పీకర్ ప్రసాద్ కుమార్ కొట్టి వేసిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం.. కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. అయినా సరే ఆయన పార్టీ మారినట్లు ఆధారాలు లేవని స్పీకర్ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. దీనిపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని రక్షించడానికి పోరాడుతున్నానని రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తారన్నారు. తెలంగాణలో జరుగుతున్నది ఆయన చెప్పేదానికి విరుద్ధంగా ఉందన్నారు.

## గ్యాస్ కొరత లేకుండా చర్యలు : సీఎస్




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎల్‌పీజీ గ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం చమురు మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌పీజీ సరఫరా, నిల్వ స్థాయిలు, రవాణా వ్యవస్థలు, భవిష్యత్తు డిమాండ్‌పై సీఎస్ చర్చించారు. గృహ వినియోగదారులకు ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. రోజువారీ పర్యవేక్షణ నిర్వహించాలని, బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించాలని, పంపిణీదారులు, ఏజెన్సీల వద్ద పోలీసు నిఘా ఉంచాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.29 కోట్ల గృహ ఎల్‌పీజీ కనెక్షన్లు ఉన్నాయని, ప్రస్తుత డిమాండ్‌ను తీర్చడానికి తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లకు అవసరమైన విధంగా ఎల్‌పీజీ సిలిండర్లను సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.



## భార్య ఉరి వేసుకుంటుంటే.. వీడియో తీసిన భర్త

**అక్షరటుడే, ఏపీ:** కడప జిల్లా రాజంపేటలో దారుణ ఘటన చోటు చేసు కుంది. భార్య ఉరి వేసుకుంటుంటే.. ఆపాల్సిన భర్త.. దగ్గరుండి వీడియో తీశాడు. బోయినపల్లికి చెందిన శ్రీరామ్ శ్రీనివాస్ లోకో పైలెట్‌గా పని చేస్తున్నాడు. అతడికి కృష్ణవేణి అనే యువతితో వివాహమైంది. దంపతుల మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం మరోసారి గొడవ పడ్డారు. దీంతో భార్య కృష్ణవేణి ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. అయితే ఆమె ఉరి వేసుకునే సమయంలో భర్త కిటికీలో నుంచి వీడియో తీశాడు. అడ్డుకునే ప్రయత్నం చేయలేదు.

## మరో డీల్ దిశగా భారత్ అమెరికా..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత్‌అమెరికాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతం దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఫ్రేమ్‌వర్క్‌పై ఇరుదేశాల మధ్య అంగీకారం కుదిరింది. కాగా.. తాజాగా మరో ప్రకటన వెలువడింది. ఇరుదేశాల మధ్య త్వరలోనే క్రిటికల్ మినరల్స్ ఒప్పందం కుదరనున్నట్లు భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ ప్రకటించారు. భారత్‌అమెరికా ద్వైపాక్షిక సహకారానికి ముఖ్యమైన రంగాల్లో క్రిటికల్ మినరల్స్ కీలకమైందన్నారు. ఈ ఖనిజాల విశ్వసనీయ సరఫరా గొలుసులు ఆర్థిక వృద్ధికి, జాతీయభద్రతకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య అతిత్వరలోనే ఒప్పందం కుదరనుందని సెర్గియో గోర్ వెల్లడించారు.

## సినిమా టికెట్ ధరల పెంపుపై సుప్రీం కీలక ఆదేశాలు


**అక్షరటుడే, ఢిల్లీ:** తెలంగాణలో మూవీ టికెట్ ధరల పెంపుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించింది. దీంతో కొత్త సినిమాలకు ఊరట లభించింది. సినిమా టికెట్ ధరల పెంపుపై గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీం నిలిపి వేసింది. టికెట్ రేట్లు పెంచాలంటే సినిమా విడుదలకు 90 రోజుల ముందే ప్రభుత్వం జీవో జారీ చేయాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. దీనిపై మైత్రీ మూవీ మేకర్స్ సుప్రీంను ఆశ్రయించింది. జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్‌లతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది.

## సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన



**అక్షరటుడే, ఢిల్లీ:** దేశ రాజకీయ చరిత్రలో సంచలన పరిణామంలో చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలంటూ పార్లమెంటులో ప్రతిపక్షాలు అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాయి. ఈ మేరకు సుమారు 190 మందికి పైగా ఎంపీలు సంతకం చేసిన నోటీసును ఇవాళ ఉభయ సభల్లో సమర్పించారు. ఇండియా కూటమి పార్టీలు సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై ఏడు ఆరోపణలతో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టారు. రాజ్యాంగబద్ధమైన పదవి లో ఉండి అధికార బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారని విపక్షాలు ఆరోపించారు. మరోవైపు విపక్షాల ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానాన్ని అధికార బీజేపీ తప్పుబట్టింది.

## ఫారిన్‌లో రెచ్చిపోయిన బోల్డ్ బ్యూటీ



బాలీవుడ్ హాట్ బ్యూటీగా పేరు తెచ్చుకున్న నటీమణుల్లో సిమ్రాన్ కౌర్ ఒకరు. ఈ బామ మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చింది. ఈ అమ్మడు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా ఈ బ్యూటీ హాట్ లుక్‌లో ఉన్న ఫొటోలను 'ఇన్‌స్టా'లో పోస్ట్ చేసింది. తన అందాలతో అభిమానులను కట్టిపడేస్తోంది. ఈ ఫొటోలు బ్యాంకాక్ ట్రిప్‌లోనివిగా తెలుస్తోంది. పొట్టి బట్టలతో స్విమ్మింగ్ పూల్ వద్ద దిగిన ఫొటోలను పోస్ట్ చేయడంతో నెట్టింట వైరల్‌గా మారాయి.

- అక్షరటుడే, సినిమాడెస్క్